# అభిమాని

-ఇలపావులూరి మురళీమోహనరావు

"నమస్కారం సార్. నా పేరు మహేంద్ర. విజయవాడలోని కనకదుర్గా కల్చరల్ అసోసియేషన్ ప్రెసిడెంటును. ఇతను రాంబాబు, సంస్థ కార్యదర్శి"- పరిచయం చేసుకున్నారు వచ్చిన వ్యక్తులు.

పంచనాథ శాస్త్రి గారు చిరునవ్వు నవ్వారు.

"చాలా సంతోషం. మీ సంస్థ కార్యకలాపాల గుర్చి విన్నాను. మీకు నాతో ఏం పని?" అన్నారు.

"వచ్చే నెలలో మా సంస్థ పన్నెండవ వార్షికోత్సవం జరుగుతుంది. వివిధ రంగాలలోని ప్రజ్ఞావంతులను ఎంపిక చేసి ప్రతి వార్షికోత్సవం నాడు ఆయా రంగానికి సంబంధించిన అవార్డునివ్వడం మా ఆనవాయితీ."

"చాలా మంచిది."

"వాటిలో సాహిత్యానికి సంబంధించి 'రాష్ట్ర కవికుల తిలక' అవార్డొకటున్నది. దాన్ని ఈ సంవత్సరం మీకివ్వాలని మా కార్యవర్గం ఏకగ్రీవంగా తీర్మానించింది. దయచేసి మీరు అంగీకరించాలి. ఈ అవార్డు కింద ఐదువేల రూపాయల నగదు, శాలువా, సన్మాన పత్రం, మొమెంటో ఇస్తాం. మన కేంద్రమంత్రి ఒకరు వీటిని ప్రదానం చెయ్యడానికి అంగీకరించారు."

"సంతోషమే. ఇప్పటివరకు ఎంతమంది కవికుల తిలకులని తయారుచేశారు?"

"ఈ అవార్డును గత నాలుగు సంవత్సరాలుగా ఇస్తున్నాం. మీరు ఐదవవారు."

"మంచిది. కానీ ఈ అవార్డు అందుకోవడానికి నాకు అర్హతేముంది."

"అమ్మమ్మ... అంత మాట అనవద్దు. ఇప్పటివరకు మీరు దాదాపు ఏభై గ్రంథాలు రాశారు. రాష్ట్ర, కేంద్ర స్థాయి అవార్డులను పొందారు. ఏడెనిమిదిసార్లు విదేశీ పర్యటనలు చేసి తెలుగు సాహితీ వైభవాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్ళారు. కొన్ని సినిమాలకు పాటలు రాశారు. పైగా గత పాతికేళ్ళుగా తెలుగు ప్రొఫెసర్‌గా ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దారు. ఇప్పటి మా జిల్లా కలెక్టర్ మీ శిష్యుడే. ఇంతకంటే ఇంకేం కావాలి. అందుకే మా కార్యవర్గం మీ పేరును ఏకకంఠంతో అంగీకరించింది."

శాస్త్రిగారు ఏదో చెప్పబోతుండగా 'ఏమండోయ్' అన్న భార్య పిలుపు వినిపించింది. లోపలికెళ్ళారు శాస్త్రిగారు.

"కాఫీ తెమ్మంటారా" అడిగింది ఇల్లాలు పార్వతి.

"అవసరంలేదు" ఒక్కటే మాట చెప్పి బయటకొచ్చారు శాస్త్రిగారు.

"సార్... మీరు అంగీకరించినట్లేనా?" అడిగాడు రాంబాబు.

"క్షమించండి. నాకిలాంటి సన్మానాలు, బిరుదుల మీద వ్యామోహం లేదు. నన్నొదిలెయ్యండి" చెప్పారు శాస్త్రిగారు.

వాళ్ళిద్దరూ మరికొంచెంసేపు బ్రతిమాలారు. ఆ అవార్డును మీబోటి వారు స్వీకరించకపోతే అవార్డుకు విలువే లేదన్నారు. శాస్త్రిగారు ససేమిరా అన్నారు.

నిరాశగా ముఖాలు పెట్టారు వారిద్దరూ. "పోనీ... మీరు మరెవరి పేరైనా సూచించండి" అన్నారు చివరకు.

"క్షమించాలి. ఈ విషయంలో మీ అంతట మీరే ఒక నిర్ణయం తీసుకోండి" లేచారు శాస్త్రిగారు.

వారిద్దరూ శెలవు తీసుకున్నారు.

"మీరు చేసిన పనేమైనా బాగుందా? ఎంతో అభిమానంతో వచ్చిన వారిని నిరుత్సాహపరిచి పంపారు" నిష్ఠూరంగా అన్నది పార్వతి బయటికొచ్చి.

"పిచ్చిదానా... వారు అభిమానులు కారు. వ్యాపారులు."

"కనీసం కప్పు కాఫీ అయినా ఇస్తే పోయేది."

"నిజమైన అభిమాని కోసం కాఫీయే కాదు. నా ప్రాణాలే సమర్పించగలను."

"రోజూ ఎంతోమంది వస్తుంటారు. ఎవరికి కూడా కాఫీ వద్దంటారు. వారిలో ఒక్కడు కూడా మీకు అభిమాని అనిపించలేదా?"

"అటువంటి అభిమాని కోసమే నా నిరీక్షణ."

ఇంతలో రిక్షా రంగయ్య వచ్చాడు. పది సంవత్సరాల క్రితం శాస్త్రిగారికి పరిచయమయ్యాడు రంగయ్య. శాస్త్రిగారి మాటలంటే అతనికి పంచప్రాణాలు. "మీ మాటలు నాకు అర్థం కావు. కానీ వింటుంటే మాత్రం చెవుల్లో అమృతం పోసినట్లుంటాదండయ్యా అంటుంటాడు. శాస్త్రిగారిని రోజూ రిక్షాలో ఎక్కించుకుని యూనివర్సిటీ ప్రాంగణంలో దింపడం ఓ ఆచారంగా పెట్టుకున్నాడు. శాస్త్రిగారు అతిథిగా వెళ్ళే సాహిత్య సభలకు వెళ్తుంటాడు.

– – –

ఒకసారి శాస్త్రిగారికి ఒక అపూర్వమైన అవకాశం వచ్చింది. అమెరికాలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ కవి సమ్మేళనానికి రావలసిందిగా ఆహ్వానం వచ్చింది. భారతదేశం నుంచి ఈ అవకాశం అందుకున్న తొలి భారతీయుడు ఆంధ్రుడు కావడంతో శాస్త్రిగారితో పాటు తెలుగు సాహిత్యలోకం కూడా పులకరించిపోయింది. అన్ని ఖర్చులు సంస్థవారే భరించి సగౌరవంగా తీసుకెళ్ళి సకల సదుపాయాలు సమకూర్చి మళ్ళీ తిరిగి పంపుతారు. ఈ కవి సమ్మేళన కార్యక్రమం రెండురోజుల తరువాత బీబీసీ లో ప్రసారమవుతుంది.

శాస్త్రిగారు ఇల్లాలితో సహా అమెరికా వెళ్ళి రోమాంచితంగా తెలుగు కవితను వినిపించి తిరిగొచ్చారు. తన కార్యక్రమం బీబీసీలో ప్రసారమయ్యే సమయాన్ని, తేదీని నగరంలోనే కాక రాష్ట్రంలో అక్కడక్కడా ఉన్న పెద్ద పెద్ద కవులకు, రచయితలకు ఫోన్ చేసి కార్యక్రమాన్ని వినమని చెప్పారు.

తీరా ఆ రోజు రానే వచ్చింది. రాత్రి పన్నెండు గంటలకు ప్రసారం. శాస్త్రిగారు, పార్వతి రేడియో ముందు కూర్చున్నారు. పన్నెండు గంటలైంది.

'అనివార్య కారణాల వల్ల కవి సమ్మేళనాన్ని వాయిదా వేశామని, తేదీ తరువాత ప్రకటిస్తా'మని చావు కబురు చల్లగా చెప్పారు బీబీసీ వారు.

శాస్త్రిగారు నిరుత్సాహపడ్డారు.

"పోన్లెండి. మరోరోజు ప్రసారం చేస్తామన్నారుగా" అన్నది పార్వతి.

"అది కాదు నా బాధ. అనవసరంగా వందమందికి ఫోన్‌చేసి చెప్పి వారి నిద్ర చెడగొట్టాను. ఏం తిట్టుకుంటారో ఏమో. రేపు అందరికీ ఫోన్‌చేసి క్షమాపణ చెప్పుకోవాలి."

## తప్పనిది




**జ**ననం ధర్మం
మరణం కర్మం
మధ్య... బతుకు మర్మం
భయంకరం...
బాధాకరం... బాధ్యతామయం

**–శిల్పా జగదీష్**

అన్నారు శాస్త్రిగారు.

ఉదయం ఆరు గంటలకే ఫోన్ మోగడంతో నిద్రలేచారు శాస్త్రిగారు. నమస్కారం శాస్త్రిగారూ!





నేను కవి భద్రాచలాన్ని. రాత్రి మీ కవిత విన్నాను. చాలా బాగుంది. తెలుగుజాతి మిమ్మల్ని చూసి గర్విస్తోంది- వినిపించింది అవతల్నుంచి.

క్షణంపాటు అవాక్కయ్యారు శాస్త్రిగారు.

మళ్లీ ఫోన్ మోగింది.

"శాస్త్రిగారూ... నేను ప్రొఫెసర్ కోదండమూర్తిని. కంగ్రాట్స్. బీబీసీలో మీ కవిత మా అందరినీ అలరించింది" వినిపించింది.

"అలాగా థాంక్స్." అన్నారు శాస్త్రిగారు.

అప్పట్నుంచి ఫోన్ వరుసగా మోగుతూనే ఉన్నది. పెద్ద పెద్ద కవులు, రచయితలు, మేధావులు, ప్రముఖులు, శాస్త్రిగారు ఎవరెవరికైతే ఫోన్లు చేసి చెప్పారో దాదాపు వారిలో మూడొంతుల మంది ఫోన్లు చేసి తాము శాస్త్రిగారి కవితను విన్నట్లు అత్యద్భుతంగా ఉన్నట్లు ఎంతో వినయంగా చెప్పి అభినందనల వర్షం కురిపించారు. మరికొంత మంది ప్రసిద్ధులు తమకు కేంద్ర ప్రభుత్వంలో గల పలుకుబడి నుపయోగించి శాస్త్రిగారి పేరును పద్మశ్రీ అవార్డుకు రికమెండ్ చేస్తామని వాగ్దానం చేశారు.

శాస్త్రిగారు పగలబడి నవ్వారు. పొట్ట పట్టుకుని నవ్వారు. అది ఏ దశకు చేరిందంటే అసలాయన నవ్వుతున్నారా? ఏడుస్తున్నారా? ఆయన కళ్ల నుండి స్రవిస్తున్నవి ఆనందబాష్పాలా? దుఃఖాశ్రువులా? అన్నది కూడా అర్థం కాలేదు.

ఇంతలో రంగయ్య వచ్చాడు.

"ఏంటి పంతులుగోరూ... మీదేదో కయిత్వం వస్తుందంటే రేడియోను చెవిలో పెట్టుకుని కూచ్చున్నాను. ఇప్పుడేస్తారు, ఇప్పుడేస్తారు అని తెల్లార్లా కూచున్నా రాలేదు. మా నిద్ర పాడుచేశారండయ్యా" చిరుకోపంగా అన్నాడు.

శాస్త్రిగారి శరీరం రోమాంచితమైంది. తనువు నిలువెల్లా పులకించింది. రంగయ్యను కౌగిట్లోకి తీసుకున్నారు.

"క్షమించు రంగయ్యా! పార్వతీ... మంచి కాఫీ పట్రా" కేక పెట్టారు శాస్త్రిగారు. ○